సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



మృత్యుఘంటికలు..

జామాయిల్ కర్ర, ఇసుక తరలిస్తున్న వాహనాల యజమానులు జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 8లో



విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేటీపీఎస్, బీటీపీఎస్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం

38° / 19°

వాతావరణం

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. రాత్రి పూట చలి ప్రభావం క్రమంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారుడైన భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారంస్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి(కనకదుర్గమ్మ) అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం గావించిన అర్చకులు నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

28న కొత్తగూడెం క్లబ్‌లో జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. విప్రో, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ముత్తూట్ గ్రూప్, గూగుల్ పే, ఎయిర్‌టెల్, వరుణ్ మోటార్స్, కియో మోటార్స్, ఎల్‌ఐసీ, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థల్లో సుమారు 3 వేలకు పైగా ఖాళీల భర్తీకి ఈ జాబ్ మేళా ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఆసక్తి గల నిరుద్యోగులు అన్ని సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

కల్తీ ఫుల్లు.. తనిఖీలు నిల్లు!

పడగ విప్పుతున్న లిక్కర్ సిండికేట్

- బెల్ట్‌షాపులకు ఏరులై పారుతున్న మద్యం
- పేరుకే పరిమితమైన ఎమ్మార్పీ అమ్మకాలు
- అధిక లాభాల కోసం మళ్లీ కల్తీ బాట



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిఘా నిద్ర పోతుంటే దగా దండుకుంటోంది అన్నట్టుగా మారింది జిల్లాలో మద్యం అమ్మకాల పరిస్థితి. ముఖ్యంగా పాల్వంచ కేంద్రంగా మద్యం సిండికేట్ పేరుతో యథేచ్ఛగా మద్యాన్ని కల్తీ చేస్తూ మందుబాబుల జేబులకు చిల్లులు పెట్టడంతో పాటు ఆరోగ్యానికీ హాని కలిగిస్తున్నారు.

కల్తీకి తెరలేపారు..

బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మడం ఎక్సైజ్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. ఒకసారి బెల్ట్‌షాపులకు మద్యం తరలిందంటే దాని క్వాలిటీ, ధర గురించి అడిగేవారే ఉండరు. అందినకాడికి దోచుకోవడమే 'బెల్ట్' నిర్వాహకుల లక్ష్యం. దీంతో మద్యం సిండికేట్ తమ గల్లాపెట్టెను మరింత వేగంగా నింపుకునేందుకు అధిక ధరలకు తోడుగా మద్యం కల్తీకి పాల్పడుతోంది. బెల్ట్‌షాపులకు తరలించే మద్యం బాటిళ్లలో నాసిరకం స్పిరిట్‌ను కలపడం, ఎక్కువ ధర కలిగిన లిక్కర్ బ్రాండ్ సీసాలో తక్కువ ధరకు లభించే మద్యాన్ని కొంత మేర కలిపేస్తూ ప్రత్యేక కౌంటర్లు, ఆటోల ద్వారా బెల్ట్‌షాపులకు ఎలాంటి బెరుకు లేకుండా తరలించేస్తున్నారు. ఈ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్లతో సరిపెట్టుకుంటుండటంతో ఇక్కడి సిండికేట్ మాఫియా పక్క రాష్ట్రాలకు సైతం కల్తీ మద్యాన్ని తరలించేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలు ఏవి..

ఎక్సైజ్ శాఖ పనితీరులో పారదర్శకతపై నలువైపులా విమర్శలు, ఆరోపణలు వస్తున్నా, పనితీరులో మార్పు రావడం లేదు. తమ ఫోకస్‌ను పూర్తిగా గంజాయి అక్రమ రవాణాపై పెట్టి.. బెల్ట్‌షాపుల దందాను చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు. దీనికి ప్రతిఫలం సైతం మద్యం సిండికేట్ నుంచి భారీగా అందుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక వైన్స్, బార్లలో అమ్మే మద్యం నాణ్యతను తరచుగా ఎక్సైజ్ అధికారులు పరీక్షించాల్సి ఉంటుంది. వైన్స్, బార్ల నుంచి శాంపిళ్లు సేకరించి ల్యాబుల్లో పరీక్ష చేయించాల్సి ఉంటుంది. పట్టపగలే ఆటోల్లో అక్రమంగా బెల్ట్ దుకాణాలకు మద్యం తరలిపోతుంటే పట్టించుకోని అధికారులు ఇక క్వాలిటీ, కల్తీ గురించి పట్టించుకునేది ఎప్పుడనే విమర్శలు వస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ రావాలి..

గతంలో పాల్వంచ కేంద్రంగా కల్తీ మద్యం రాకెట్ వెలుగు చూసింది. ఆ తర్వాత ఇక్కడ బెల్ట్‌షాపుల్లో అధిక ధరలతో తమ జేబులకు చిల్లులు పెట్టడంపై మద్యం ప్రియుల నుంచి విమర్శలు వచ్చాయి. ఆఖరికి స్వచ్ఛంద సంస్థలు రంగంలోకి దిగి హైదరాబాద్ స్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గతేడాది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇక్కడ ప్రత్యేకంగా దాడులు నిర్వహించి కొందరు ఎక్సైజ్ అధికారులపై వేటు వేసింది. ఫలితంగా కొంతకాలం పాటు సిండికేట్ ఆగడాలకు అడ్డుకట్ట పడింది. కానీ టాస్క్‌ఫోర్స్ దాడులు తగ్గిపోవడంతో మరోసారి లిక్కర్ సిండికేట్ పడగ విప్పడం ప్రారంభించింది. దీంతో సిండికేట్ ఆట కట్టించాలంటే మరోసారి స్టేట్ టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

సర్వం.. బెల్ట్ మయం

పాల్వంచ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 5 బార్లు, 8 వైన్స్ షాపులు ఉన్నాయి. ఇటీవల మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారీతిన మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. గరిష్ట అమ్మకం ధరపై వచ్చే లాభం సరిపోవడం లేదంటూ దొడ్డి దారిన భారీ ఎత్తున మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. అక్కడ క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.20, బీరు బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. పట్టణంలోని గల్లీలతో పాటు మండల పరిధిలోని 36 గ్రామ పంచాయతీల్లో బెల్ట్‌షాప్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. ప్రతీరోజు వైన్‌షాపుల్లోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా మద్యాన్ని బెల్ట్ షాపులకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. పట్టణంలోని వైన్ షాపుల నుంచి కిన్నెరసాని వైపు ఉన్న గ్రామాల సిండికేట్ షాపులకు మద్యం సరఫరా అవుతోంది. పెద్దమ్మగుడి వద్ద గల షాపుల నుంచి జగన్నాథపురం, కేశవాపురం, సోములగూడెం, సంగెం, దంతెలబోర, రంగాపురం, తోగ్గూడెం తదితర ప్రాంతాల్లోని షాపులకు తరలిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటాం

నేను జిల్లాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. గతేడాది పాల్వంచ మండలం నుంచి కల్తీ మద్యంపై ఒక ఫిర్యాదు రాగా శాంపిళ్లు సేకరించాం. అందులో కల్తీ ఏమీ తేలలేదు. కల్తీ మద్యంపై ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రానున్న రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సగటున 37 నుంచి 38.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, రైతులు మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైద్య పరీక్షలు సక్రమంగా చేయాలి

సిబ్బందికి డీఎంహెచ్‌ఓ ఆదేశం

టేకులపల్లి: పీహెచ్‌సీకి వచ్చేవారికి వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఆశ కార్యకర్తలకు జరుగుతున్న సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ శిక్షణ శిబిరానికి వెళ్లి వారికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కంటివెలుగు కార్యక్రమ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారందరికీ కళ్లజోళ్లు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్‌లు, కార్యదర్శుల సహకారంతో 18 ఏళ్లు నిండిన వారందరినీ కంటివెలుగు శిబిరానికి తరలించి, పరీక్షలు చేయాలని చెప్పారు.



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న శిరీష

కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్, అధికారులు అన్నా మేరీ, సీతమ్మ, పీహెచ్‌ఎన్ సత్యవతి, ట్రెనింగ్ సూపర్‌వైజర్లు కె.చిట్టెమ్మ, ఎస్.విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, వీసం శకుంతల, అక్బర్, లలిత, నాగలక్ష్మి, అరుణకుమారి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మున్సిపల్ సమస్యలపై నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



సీహెచ్.శ్రీకాంత్
మున్సిపల్ కమిషనర్

పాల్వంచ: పట్టణ వాసులను కుక్కలు, కోతుల బెడద వేధిస్తోంది. దీనికి తోడు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య ఎదుర్కొంటున్న వారు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' సమన్వయం చేయాలని సంకల్పించింది. ఈమేరకు శనివారం ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి పాటుపడతారు.

తేది : 25 - 02 - 2023, శనివారం, సమయం : ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్ చేయాల్సిన నంబర్ 98499 05884

దివ్యాంగులు స్వశక్తితో ఎదగాలి

కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంటౌన్: దివ్యాంగులు స్వశక్తితో ఎదగాలని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీఎస్సార్ నిధులతో దివ్యాంగుల కోసం కొనుగోలు చేసిన సహాయ ఉపకరణాలను కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనిషి ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాదని, అంగవైకల్యాన్ని అధిగమించి అందరితో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో సహాయ పరికరాలు కావాలని దివ్యాంగులు వినతులు ఇస్తున్నారని, వాటి ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో 405 మందికి వివిధ రకాల పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈసీఐఎల్ కంపెనీ దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఇచ్చేందుకు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. రూ.40 లక్షల సీఎస్సార్ నిధులతో 741 సహాయ పరికరాలను అందజేసినట్లు వివరించారు. జిల్లాలో 30,173 మంది దివ్యాంగులు ఉండగా, వారిలో 18,051 మంది శారీరక దివ్యాంగులు, 3,715 మంది మూగ, చెవిటి వారు, 4,314 మంది మానసిక దివ్యాంగులు, 4,093 మంది అంధులు ఉన్నారని తెలిపారు. వారిలో 407 మందిని ప్రస్తుతానికి ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, ఈసీఐఎల్ అడిషనల్ జనరల్ మేనేజర్ మునికృష్ణ, ఈసీఐఎల్ సీనియర్ వైద్యాధికారి విశ్వనాథరెడ్డి, పర్సనల్ అధికారి సునీల్‌కుమార్, సీనియర్ మేనేజర్లు రాజేష్, కె.శ్రీనివాసరావు, యూనిట్ మేనేజర్ బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండపనేని సతీష్ పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే వనమా తదితరులు

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేస్తాం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని మార్చి 15 వరకు పూర్తి చేస్తామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాలు లేకుండా నిర్మించిన ఇళ్ల సమాచారం సేకరణ, కంటి వెలుగు, రెండు పడక గదుల ఇళ్లు, ఆయిల్‌పామ్ సాగు తదితర అంశాలపై కలెక్టర్లతో చర్చించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. జిల్లాలో 16,860 ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటికి 13,575 ఎకరాల్లో పూర్తి చేశామని, మిగిలిన 3,285 ఎకరాల్లో వచ్చే నెల 15 నాటికి పూర్తి చేస్తామని వివరించారు. మొక్కలు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కంటి వెలుగు పరీక్షల నిర్వహణలో రీడింగ్ అద్దాలను తక్షణమే పంపిణీ చేస్తున్నామని, ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాలు పంపిణీ చేసిన వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తామని చెప్పారు. లబ్ధిదారులకు మార్చిలో క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. చెప్పారు. పోడు పట్టాల జారీకి జిల్లా స్థాయిలో కమిటీ వేసి, పట్టాల ముద్రణ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. జిల్లాలో పోడు పట్టాల జారీ ప్రక్రియ, కంటి వెలుగు కార్యక్రమాల నిర్వహణ తీరును సీఎస్ అభినందించారు. సమావేశంలో డీఎఫ్‌ఓ రంజిత్ నాయక్, అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, ఉద్యాన అధికారి మరియన్న, వ్యవసాయాధికారి అభిమన్యుడు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలని తపన!

- శిక్షణ డబ్బు కోసం చోరీల బాట
- నిందితుడి అరెస్టు.. రూ.45లక్షల సొత్తు స్వాధీనం
- ఏడుగురు సభ్యుల దోపిడీ ముఠా కూడా అరెస్టు...

ఖమ్మంక్రైం: ప్రపంచంలో అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనేది ఆ యువకుడి తపన. కానీ శిక్షణ పొందేందుకు ఆర్థిక స్తోమత లేదు. దీంతో చోరీల బాట ఎంచుకున్న ఆయన చివరకు పోలీసులకు పట్టుబడగా భారీ మొత్తంలో సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం వెల్లడించారు. ఖమ్మం అర్బన్ మండలం పాండురంగాపురానికి చెందిన సంపటి ఉమాప్రసాద్‌కు ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలనేది కల కాగా, జిమ్‌కు వెళ్తూ దేహదారుఢ్యంపై శ్రద్ధ వహించేవాడు. అయితే, పర్వతాలు అధిరోహించడానికి ప్రత్యేక శిక్షణ అవసరమని, అందుకోసం డబ్బు చాలా ఖర్చవుతుందని తెలుసుకున్నాడు. దీంతో ఆయన డబ్బు సంపాదనకు దొంగతనాలే మార్గమని నిర్ణయించుకున్నాడు. రెండేళ్ల నుంచి ఉదయమంతా దాబుసరిగా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళ చోరీలకు పాల్పడేవాడు. ఖానాపురం హవేలీ పోలీసుస్టేషన్ పరిధిలో ఆరు, ఖమ్మం టూటౌన్ పరిధిలో రెండిళ్లలో దొంగతనాలు చేశాడు. దొంగిలించిన సొత్తులో నగదు, బంగారు ఆభరణాలు ఉండటంతో వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నాక ఎవరెస్ట్ అధిరోహణకు శిక్షణ తీసుకోవాలని భావించాడు. ఈక్రమంలోనే జిల్లా కేంద్రంలో చోరీలు పెరుగుతుండడంతో పోలీసులు నిఘా ఏర్పాటుచేయగా, శుక్రవారం ఉదయం బైపాస్ రోడ్డులో సీసీఎస్, ఖమ్మం టూ టౌన్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఉమాప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల వ్యవహారం బయటపడింది. ఈ సందర్భంగా నిందితుడి నుంచి రూ.42లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వారియర్ వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ వారియర్, పక్కన అధికారులు

దారి దోపిడీ ముఠా అరెస్టు

ఖమ్మం రూరల్ సబ్ డివిజన్‌లోని రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్‌ల్లో జల్సాల కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్‌లపై వెళ్తున్న వారిని బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ఏడుగురి ముఠాను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాన్నెకల్ క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన తనిఖీల్లో పగడాల విజయ్ అలియాస్ చంటి, ధంసలాపురానికి చెందిన సాదెం లక్ష్మీనారాయణ, దానవాయిగూడెంకు చెందిన షేక్ సైదులు, ఖమ్మంకు చెందిన షేక్ షబాజ్ అలియాస్ సిద్దిఖీ అలియాస్ షాబు, బోనకల్ మండలం చినబీరవెల్లికి చెందిన పాకాలపాటి ధర్మతేజ, ఖమ్మం ప్రకాష్ నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్, రామన్నపేటకు చెందిన పసుపులేటి సాయిగా వృత్తిరీత్యా ఆటో, కారు డ్రైవర్లుగా పనిచేస్తుండగా, కొందరు పంక్చర్ షాపులు నడుపుతున్నారు. అయితే, జల్సాలకు పడిన వీరు ముఠాగా ఏర్పడి శివారు ప్రాంతాలలో ఒంటరిగా వెళ్లే జంటలను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. ఈక్రమంలో 16 కేసుల్లో నిందితులైన వీరిని అరెస్టు చేసి రూ.7.50లక్షల విలువైన ఆభరణాలు, రూ.14.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.67లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్న సీసీఎస్, ఖమ్మం నగర, రూరల్ పోలీసులను సీపీ వారియర్ అభినందించి క్యాష్ అవార్డులు అందజేశారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రవి, గణేష్, బస్వారెడ్డి, సీఐలు శ్రీధర్, రామకృష్ణ, జితేందర్‌రెడ్డి, ఎస్సైలు వెంకటకృష్ణ, వరాల శ్రీనివాస్, సురేష్, గిరిధర్‌రెడ్డి, సిబ్బంది గజేంద్ర, చట్టు శ్రీనివాస్, లింగయ్య, కోలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్ధాకలి చదువులు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలెప్పుడో ?
- ప్రతిపాదనలతోనే సరిపెడుతున్న పాలకులు
- ఏళ్లుగా విద్యార్థుల ఎదురుచూపులు



ఇళ్ల దగ్గరి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

బూర్గంపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఇళ్ల దగ్గరి నుంచి కొందరు విద్యార్థులు మధ్యాహ్న భోజనం తెచ్చుకుంటుంటే, మరికొందరు లంచ్ బాక్స్‌లు లేకుండానే కాలేజీలకు వస్తున్నారు. భోజనం తెచ్చుకోని వారిలో కొందరు కడుపు మాడ్చుకుంటుండగా, మరికొందరు తోటి విద్యార్థులు తెచ్చుకున్న దాంట్లో భాగం పంచుకుంటున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఈ పథకం అమలుకు రెండేళ్లుగా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారే తప్ప అమలు కావడం లేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాలల్లో ఉండే విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేకపోవటంతో నీరసించిపోతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమస్యగా మారింది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుకునే వారిలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన వారే. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరాలి. కూలీ పనులకు వెళ్లే తల్లిదండ్రులు వీరికి లంచ్‌బాక్స్ కట్టి ఇవ్వటం కొంత ఇబ్బందికరంగానే మారింది. ఒకరోజు లంచ్ బాక్స్ ఇస్తే, రెండురోజులు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. లంచ్‌బాక్స్ సిద్ధం చేసేందుకు సమయం లేకపోవటం, కొందరికి ఆర్థిక ఇబ్బందులు వంటి కారణాలతో చాలామంది విద్యార్థులు ఉదయాన్నే ఇంటి వద్ద భోజనం చేసి లంచ్ బాక్స్‌లు లేకుండానే కళాశాలలకు వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్ధాకలితో చదువులను కొనసాగిస్తున్నారు. కొందరు మంచినీళ్లతోనే కడుపు నింపుకుంటున్నారు. కొంతమంది మిత్రులు తెచ్చిన భోజనాన్ని పంచుకుంటుండగా, అది ఇద్దరికీ సరిపోవడం లేదు. కౌమార దశలో ఉన్న విద్యార్థులు కడుపునిండా తినకపోవటంతో అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగింది. విద్యార్థులు పగలంతా కళాశాలలో ఉండాలంటే ఒంట్లో సత్తువ ఉండాలి. అందుకు సరిపడా ఆహారం తీసుకోవాలి. ప్రాక్టికల్స్, ప్రీ ఫైనల్ పరీక్షలపై దృష్టి పెట్టాల్సిన సమయమిది. ఈ తరుణంలో అయినా విద్యార్థులకు కనీసం స్నాక్స్ అందిస్తే కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	14
ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు	2,991
ద్వితీయ సంవత్సర విద్యార్థుల సంఖ్య	2,622

ఆర్థిక ఇబ్బందులతో బాక్స్ తేవడం లేదు



ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో లంచ్ బాక్స్ తెచ్చుకోవటం లేదు. ఉదయాన్నే ఇంటి దగ్గర తినివస్తా. మళ్లీ సాయంత్రం ఇంటికి వెళితేనే తినేది. ఫ్రెండ్స్ తినమంటారు. కానీ నాకు ఆకలిగా లేదని చెబుతా. కాలేజీలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే బాగుంటుంది.

– శెనగ లహరి, వెలేరు

లంచ్ బాక్స్ కోసం ఉంటే ఆలస్యమవుతుంది



కళాశాలకు సకాలంలో వెళ్లాలంటే ఉదయం 8.30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరాలి. ఆ సమయానికి రోజూ లంచ్ బాక్స్ తయారు కాదు. అప్పటికే ఇంట్లో ఏది ఉంటే అది తిని హడావుడిగా బయలుదేరుతున్నాం. లంచ్ బాక్స్ తెచ్చుకోని రోజు మధ్యాహ్నం బాగా ఆకలేస్తుంది. నీళ్లు తాగి సాయంత్రం వరకు ఆలాగే ఉంటాం.

– అక్షయ్‌కుమార్, సారపాక

ఇబ్బందులున్న మాట నిజమే



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కాక ఇబ్బందులున్న మాట నిజమే. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి లంచ్‌బాక్స్‌లు తెచ్చుకోవటం లేదు. మధ్యాహ్న భోజనం లేకపోవటంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. విద్యార్థులు ఎక్కువగా రెసిడెన్షియల్ కాలేజీల వైపే మొగ్గుచూపుతున్నారు.

– సులోచనరాణి, డీఐఈఓ

క్లుప్తంగా

మామకన్ను డీఆర్‌ఓ సస్పెన్షన్

గుండాల: కాచనపల్లి రేంజ్ పరిధిలోని మామకన్ను సెక్షన్‌లో వివిధ గ్రామాల నుంచి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో డీఆర్‌ఓ జాహెదా బేగంను జిల్లా అధికారులు శుక్రవారం సస్పెండ్ చేశారు. సంవత్సర కాలంగా మామకన్ను సెక్షన్ పరిధిలో టేకు కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు, కార్పెంటర్ల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు స్థానికుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ చేపట్టిన అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు.

ఎద్దులు అపహరణ

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాపు, కమలాపురం గ్రామాల్లో ఇద్దరు రైతులకు చెందిన మూడు ఎద్దులను దొంగలు అపహరించిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వర్క్‌షాపు గ్రామానికి చెందిన సునీల్ ఎద్దును బయటకట్టేసి ఉంచగా, అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కమలాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన రెండు ఎద్దులను కూడా అపహరించినట్లు తెలిసింది. కాగా ఎద్దుల అపహరణపై బాధితులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా



డీజిల్ పట్టుకుంటున్న స్థానికులు

దమ్మపేట : మండల పరిధిలోని ముష్టిబండ గ్రామశివారులో డీజిల్ ట్యాంకర్ బోల్తాపడిన సంఘటన శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి డీజిల్ కారిపోతుండగా స్థానికులు, వాహనదారులు బిందెలు, బకెట్లలో నింపుకుని తీసుకెళ్లారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు,

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

జూలూరుపాడు: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కొమరం వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మాచినేనిపేటతండాకు చెందిన వాంకుడోత్ సేవియా(35) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలుమార్లు ఆస్పత్రికి తీసుకెళ్లినా నయంకాలేదు. భరించలేని కడుపునొప్పి వస్తుండటంతో చనిపోతానంటూ తరచూ కుటుంబ సభ్యులకు చెబుతుండేవాడు. దీంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తామంటూ కుటుంబ సభ్యులు మనోధైర్యం కల్పిస్తున్నారు. కాగా గురువారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికే సేవియా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. దీంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య వాంకుడోత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోత్ విజయ్ గురువారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబసభ్యులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం ఖమ్మం తరలించారు. కాగా విజయ్ తండ్రిని సేవాలాల్ ఆలయంలో పూజారిగా నియమిస్తానని అదే గ్రామానికి చెందిన బాబూరావు అనే వ్యక్తి డబ్బులు తీసుకున్నాడు. కానీ పూజారిగా మరో వ్యక్తిని నియమించారు. దీంతో విజయ్ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగగా బాబూరావు గొడవపడి తిట్టాడు. దీంతో మనస్తాపం చెందిన విజయ్ పురుగులమందు తాగాడు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో..

వైరా: అప్పు కోసం తాకట్టు పెట్టిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరానికి చెందిన ఇండ్ల గోపాలరావు 1205 సర్వే నంబర్‌లోని 242 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి సాదా అగ్రిమెంట్ రాయించుకున్నాడు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన గోపాలరావు నగదు అవసరాల కోసం ప్లాట్ కాగితాన్ని ఓ నాయకుడి వద్ద తాకట్టు పెట్టాడు. అయితే, ఎన్నికల్లో గోపాలరావు ఓడిపోగా, నగదు చెల్లించకపోవడంతో శుక్రవారం సదరు నాయకుడు ప్లాట్ అమ్మిన వ్యక్తి నుంచి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాలరావు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు రాలేదని తెలిపారు.

మృత్యుఘంటికలు..

ప్రాణాలు తీస్తున్న ఓవర్ లోడింగ్..

- ఇసుక లారీలు, జామాయిల్ ట్రాక్టర్లతో ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహన యజమానులు
- మామూళ్ల మత్తులో రవాణా, మైనింగ్ శాఖల అధికారులు



సోంపెల్లి వద్ద బోల్తా పడిన జామాయిల్ ట్రాక్టర్ (ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం(ఫైల్)

- ఈ నెల 8న బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఓ ఇసుక లారీ ఢీకొట్టి పాల్వంచ మండలం బంద్రిగొండ గ్రామానికి చెందిన నెల్లెల రంజిత్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.
- ఈ నెల 20న ఒడిశాలో జామాయిల్ లోడింగ్‌కు వెళ్లిన ట్రాక్టర్ తిరగబడి సారపాకకు చెందిన సున్నం నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఇదే నెలలో బూర్గంపాడు మండలం సోంపెల్లి గ్రామం వద్ద జామాయిల్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ తిరగబడి దమ్మపేట మండలానికి చెందిన చిక్కినేని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.
- పై ఘటనలను పరిశీలిస్తే వాహనాల యజమానుల అత్యాశ, రవాణా శాఖ, మైనింగ్ ఇతర ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం.. వెరసి నిరుపేద కూలీలు, డ్రైవర్ల ప్రాణాలను హరిస్తున్నాయి. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

భద్రాచలం: వాహనాల్లో జామాయిల్ కర్ర, ఇసుక తరలిస్తున్న యజమానులు ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు బోల్తా పడటం, రోడ్డు ప్రమాదాలకు కారణమవడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. రాత్రి వేళల్లో బైక్‌లను ఢీకొడుతుండటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు.

జామాయిల్ ఓవర్ లోడింగ్‌తో..

జిల్లాలో సారపాక వద్ద ఉన్న ఐటీసీ పీఎస్‌పీడీ పేపర్ మిల్లుకు ముడి సరుకుగా అవసరమైన జామాయిల్ పెంపకానికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాలు అనువుగా ఉన్నాయి. దీంతో జామాయిల్ తోటల పెంపకం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. పెంపకం అనంతరం కొట్టిన జామాయిల్ కలపను ట్రాక్టర్ ద్వారా కాంట్రాక్టర్‌లు, రైతులు ఐటీసీకు తరలిస్తారు. రాజమండ్రి, ఇతర జిల్లాల నుంచి సుమారు రోజుకు 120 నుంచి 150 ట్రాక్టర్‌లు జామాయిల్‌ను తీసుకొస్తుంటాయి. ఈ తరలించే క్రమంలో నిర్దిష్ట ప్రమాణాల కంటే ఎక్కువ టన్నులు లోడింగ్ చేయటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి ట్రాక్టర్ వెనుక భాగంలో కేవలం 10 టన్నులను మాత్రమే తరలించాల్సి ఉండగా 15 నుంచి 17 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటమో, ఇతర వాహనాలను ఢీకొట్టడమో జరుగుతోంది.

అధికారుల చేతివాటం..

వాహనాల రాకపోకలపై, ఓవర్‌లోడింగ్‌పై నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ, మైనింగ్, ఇతర సంబంధిత శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రమాదాలు జరిగాక, బాధితులు ప్రాణాలు కోల్పోయాక నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ, జరిమానాలు విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వరుస సంఘటనల్లో పలువురు మృత్యువాత పడ్డాక నెమ్మదిగా తేరుకున్న రవాణా శాఖ అధికారులు.. గత రెండు రోజుల నుంచి జామాయిల్ ఓవర్ లోడింగ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. అయితే భద్రాచలంలోని రవాణా శాఖ కార్యాలయం ముందు నుంచే నిరంతరం ఓవర్ లోడ్‌తో వెళ్తున్న జామాయిల్ ట్రాక్టర్లను పట్టుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక మామూళ్ల మత్తులో జోగే మైనింగ్ శాఖ అధికారులు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను పట్టుకున్న దాఖలాలు లేవు. హైదరాబాద్ నుంచి వచ్చే స్పెషల్ టాస్క్ అధికారులు పట్టుకోవడం తప్ప స్థానిక అధికారులు పట్టుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇసుకాసురులకు కాసులు.. ప్రయాణికులకు యమపాశాలు..

ఇసుకాసురులు లారీల్లో ఇసుక ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరులతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక వాహనాలు నిత్యం హైదరాబాద్‌తో సహా ఇతర జిల్లాలకు వెళ్తుంటాయి. వీటిలో ఏ ఒక్క లారీ కూడా రవాణా, మైనింగ్ శాఖ నిబంధనలు పాటించవు. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 25 నుంచి 26 టన్నులు, 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా సుమారు 32 టన్నులకు పైగానే ఓవర్ లోడ్‌తో తిప్పుతున్నారు. ఇసుక ర్యాంప్, వాహన యజమానులు డబ్బులను పోగు చేసుకుంటుండగా ప్రమాదాలతో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నవారు మృత్యువాత పడుతున్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళ్తున్న లారీ ఇటీవల ఓ వాహనాన్ని క్రాస్ చేస్తూ పినపాక వద్ద ఓ నిరుపేద కూలీ మృతికి కారణమయింది. జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ ఛిద్రం అవుతున్నాయి.



ఈ నెల 8న పినపాక వద్ద కూలీ మృతికి కారణమైన ఇసుక లారీ

తనిఖీలు జరుపుతున్నాం..



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న జామాయిల్ ట్రాక్టర్లు, ఇసుక లారీలను నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నాం. నిబంధనలను పాటించని వాహనాల యజమానులకు జరిమానా విధిస్తున్నాం. రూల్స్ ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.

– తోట తిరుపతి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, భద్రాచలం

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రూ.3 లక్షల నగదు, రూ.15 లక్షల దొంగనోట్లు స్వాధీనం
- నలుగురు వ్యక్తుల అరెస్టు, పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్, సీఐ సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: నకిలీ కరెన్సీ నోట్లు చెలామణీ చేసేందుకు వచ్చిన ఓ ముఠా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో టీ తాగేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడింది. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. శుక్రవారం వన్‌టౌన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఎస్‌ఐ టి.లచ్చయ్య తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో ఆ ప్రాంతానికి వచ్చిన నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారు జూలూరుపాడు మండలం కొమ్ముగూడేనికి చెందిన బానోతు భోజ్యానాయక్, ఖమ్మం జిల్లా వేంసూరు మండలానికి చెందిన తనమల్ల రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమలంక గ్రామానికి చెందిన బీరెపల్లి రాంబాబు, కొత్తగూడెం బాబుక్యాంప్‌నకు చెందిన జలమని భాస్కర్‌గా తేలింది. ఈ నలుగురు కారు ఓనర్ చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన పున్నం ప్రసాద్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు నకిలీ కరెన్సీ నోట్లు చెలామణీ చేయాలని పథకం వేసుకున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం మార్కెట్ ఏరియాలో నకిలీనోట్లు చెలామణీ చేసేందుకు బయల్దేరిన నలుగురు టీ తాగేందుకు బస్టాండ్ సెంటర్‌కు వచ్చారు. అనుమానాస్పదంగా వ్యవహరించి పోలీసులకు పట్టుబడ్డారు. కారులో తనిఖీ చేయగా రూ.3 లక్షల నగదు, దొంగనోట్లు తయారు చేయడానికి ఉపయోగించే యాసిడ్ బాటిళ్లు, నల్లపేపర్ బండిళ్ల కట్టలు 5, చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఉపయోగించే 500 నకిలీ నోట్ల కట్టలు 33 లభ్యమయ్యాయి. కారుతోపాటు నగదు, నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా కారు ఓనరు పున్నం ప్రసాద్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై టి.లచ్చయ్య, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, ఫని, సురేష్, వీరన్న, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సుజాతనగర్: మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీకి చెందిన 16 బాలిక అదృశ్యంపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గురుకుల కళాశాలలో చదువుతున్న బాలిక అనారోగ్యానికి గురికావడంతో 23 రోజుల క్రితం హాస్టల్ నుంచి తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పి.తిరుపతిరావు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



పాల్వంచ: కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

పీఆర్‌సీ ప్రకటించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన

పాల్వంచ/మణుగూరు రూరల్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీ విడుదల చేయాలని, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాల్వంచలో కేటీపీఎస్, మణుగూరులో బీటీపీఎస్ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించిన నిరసన తెలిపారు. ఆందోళనతో ఉదయం షిఫ్టనకు వెళ్లే ఉద్యోగ, కార్మికులు నిలిచిపోయారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటనపై జెన్‌కో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు మధ్యాహ్న భోజన సమయంలో కర్మాగారంలో ధర్నాలు, 8వ తేదీ నుంచి 23వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడతామని వివరించారు. మార్చి 24న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. పాల్వంచలో జేఏసీ నాయకులు సుధీర్, బ్రహ్మాజీ, మధుబాబు, మాజీద్, సీతారాం రెడ్డి, అఖిలేష్ రెడ్డి, రాధాకృష్ణ, నరసింహారావు, రాజేందర్, కోటేశ్వరరావు, రవీందర్, నాగేశ్వరరావు, ప్రభాకర్, శివరామ్, వేణుగోపాల్, మణుగూరులో జేఏసీ నాయకులు వి.ప్రసాద్, రవిప్రసాద్, రవితేజ, బి.సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, వీరస్వామి, రాజబాబు, దయాకర్, కె నరసింహారావు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు రూరల్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీటీపీఎస్ ఉద్యోగులు

ఐదుగురికి ఏడాది జైలుశిక్ష



కొత్తగూడెంటౌన్: చేతబడి చేశారనే నెపంతో ములకలపల్లికి చెందిన కేసరి రామచంద్రంపై దాడి చేసి కొట్టిన ఐదుగురు వ్యక్తులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బత్తుల రామారావు శుక్రవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. ములకలపల్లి మండలం ముగురాళ్లగొప్ప గ్రామానికి చెందిన గుండె రమేష్ కూతురు అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తిప్పాడు. 2017, జూలై 5న చికిత్స కోసం సత్తుపల్లికి వెళ్తుండగా మృతి చెందింది. దీంతో అదే గ్రామానికి చెందిన కేసరి రామచంద్రం చేతబడి చేయడంతోనే తన కూతురు మృతి చెందిదంటూ అదే రోజు రాత్రి రమేష్ దాడికి దిగాడు. రమేష్‌తోపాటు గుండె నాగరాజు, గుండె వెంకటేష్, గుండె రాజేష్, గుండు శ్రీను, గుండి భద్రయ్య మూకుమ్మడిగా వచ్చి కర్రలు, గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో రామచంద్రం దంతాలు ఊడిపోయాయి. ఈ ఘటనపై గ్రామానికి చెందిన కేసరి శ్రీను 2017, జూలై 6న ములకలపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. విచారణ సమయంలో గుండి భద్రయ్య మృతి చెందాడు. ఆరుగురు సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో మిగిలిన ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. 143,147,148 సెక్షన్ల కింద నెల చొప్పున, 324 సెక్షన్ కింద సంవత్సరం, 342, ఆర్/డబ్ల్యూ, 149/ఐపీసీ సెక్షన్ కింద ఆరు నెలల చొప్పున శిక్షతోపాటు రూ.1300 జరిమానా విధించారు. శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఏ.రాజారాం వాదించగా, నిర్వహించగా వీరబాబు, హరిగోపాల్, కోర్టు పీసీ బిక్కులాల్ సహకరించారు.

వివాహేతర సంబంధం నేపథ్యాన దేహశుద్ధి



పోలీసు వాహనం వద్ద గుమికూడిన బంధువులు

నేలకొండపల్లి: వివాహేతర సంబంధం గుట్టురట్టు కావడంతో ఇద్దరిని గదిలో బంధించి దేహశుద్ధి చేశారు. మండలంలోని మంగాపురం తండాకు చెందిన ఇద్దరికి వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు జన్మించాక ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయమై పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించినా మార్పు రాలేదు. దీంతో శుక్రవారం ఇద్దరు గదిలో ఉండగా, బంధువులు చేరుకుని బంధించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా వారిని తీసుకెళ్లే క్రమంలో బంధువులు అడ్డుకోగా, పోలీసులు నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

సుజాతనగర్: వ్యక్తి బలవన్మరణంపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.తిరుపతిరావు కథనం ప్రకారం.. సుజాతనగర్‌కు చెందిన కొమ్మరాజు నాగేశ్వరరావు(34) కొంతకాలంగా గ్యాస్ట్రబుల్, గుండెనొప్పితో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- ఒకేరోజు ఏడుగురికి కాటు
- ఇల్లెందులో 9 మేకపిల్లలు మృతి



జగన్నాథపురంలో కుక్క కాటుకు గురైన చిన్నారితో తండ్రి దుర్గాప్రసాద్, (ఇన్‌సెట్) చిన్నారి చేతికి గాయం

పాల్వంచరూరల్/ఇల్లెందు : జిల్లాలో శుక్రవారం వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. పాల్వంచ మండల పరిధిలో ఏడుగురిని కాటేయగా, ఇల్లెందు పట్టణంలో ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న మేకలపై దాడి చేసి 9 పిల్లలను చంపేశాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కుక్కకాటు బాధితులకు పాల్వంచ ఏరియా ఆస్పత్రి, జగన్నాథపురం పీహెచ్‌సీలో చికిత్స అందించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన జర్పుల దుర్గాప్రసాద్ – లలిత దంపతుల 16 నెలల చిన్నారి భానుశ్రీ ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కుక్క కాటు వేసింది. అదే గ్రామంలోని జామాయిల్ తోటలో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాద్విక్, ప్రతిభ, రంగాపురం గ్రామానికి చెందిన సురేష్, పూసుగూడేనికి చెందిన తులసీరాం, ఉప్పుసాకకు చెందిన నాలుగేళ్ల సుచిత, పాల్వంచకు చెందిన హేమంత్ కుక్కల దాడిలో గాయపడ్డారు.

మేక పిల్లలను హతమార్చిన కుక్కలు

ఇల్లెందు పట్టణంలోని 15 నంబర్ బస్తీకి చెందిన శంకర్‌పాసి 50 మేకలను అడవికి తీసుకెళ్లగా, 9 పిల్లలను కొట్టంలో కట్టేసి ఉంచాడు. వాటికి కాపలా ఉన్న కుటుంబ సభ్యులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇంట్లోకి వెళ్లగా, కుక్కలు దాడి చేసి 9 పిల్లలను చంపేశాయి. చనిపోయిన మేక పిల్లల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని శంకర్ పాసీ చెప్పాడు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కరకగూడెం: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఎంఓ రమణయ్య , స్పెషల్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం జగన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు



కోడలిపై చేయి చేసుకుంటున్న అత్త

పాల్వంచ: కోడలు అదనపు కట్నం తేవడం లేదని అత్త చేయి చేసుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. స్థానికుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పిచ్చయ్య బంజరకు చెందిన రాజేష్ మొదటి భార్య మృతి చెందడంతో శ్రీలతను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు కూతుళ్లు ఉండగా, శ్రీలతకు కుమారుడు ఉన్నాడు. ముగ్గురి ఆలనాపాలన శ్రీలతనే చూసుకుంటోంది. కాగా కొన్ని రోజులుగా అత్త లక్ష్మీబాయి పది లక్షల కట్నం తేవాలంటూ వేధిస్తోందని శ్రీలత ఆవేదన వ్యక్తం చేసింది. అనేక మార్లు తనను హింసించి, చేయి చేసుకుంటోందని కన్నీళ్ల పర్యంతయింది. ఈ విషయమై ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కారు సామగ్రి ఊడబెరికిన శునకాలు



కారు సామగ్రిని తొలగించిన దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని న్యూగొల్లగూడెంలో ఓ ఇంటి ముందు గురువారం రాత్రి సమయంలో కారు పార్కు చేసి ఉండగా, ఆ కారుకు బిగించి ఉన్న సామగ్రిని ఊడబెరికాయి. సామగ్రిని పనికి రాకుండా ముక్కలు, ముక్కలుగా చేశాయి. మున్సిపల్ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా...

అజయ్ బంగా హెచ్‌పీఎస్ విద్యార్థే

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన బంగా



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన భారత–అమెరికన్ అజయ్ బంగా బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) విద్యార్థే. మాస్టర్ కార్డ్ మాజీ సీఈవో అజయ్ బంగా 1976 బ్యాచ్‌కు చెందిన హెచ్‌పీఎస్ విద్యార్థి. ప్రస్తుత వరల్డ్ బ్యాంకు ప్రెసిడెంట్ మాల్పాస్ తర్వాత అజయ్ నామినేట్ అయిన సంగతి తెలిసిందే. 'మా పూర్వ విద్యార్థుల్లో మరొకరు ప్రపంచ సంస్థలో ఉన్నత స్థాయికి చేరుకోవటం పాఠశాలకు గర్వకారణం' అని హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ జే నోరి యా తెలిపారు. కాగా, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల అధినేతలు హెచ్‌పీఎస్ విద్యార్థులే కావటం విశేషం. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో పాటు కావియం కో–ఫౌండర్ సయ్యద్ భఖ్రత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, క్రికెటర్ కామెంటర్ హర్షా భోగ్లే, ప్రముఖ సినీనటులు రానా దగ్గుపాటి, అక్కినేని నాగార్జున, రామ్‌చరణ్, ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి ఎందరో ప్రముఖులు హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులు.

కొత్తగా 16 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 3,209 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.



ఏపీలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 'ఈనాడు' ప్రతులను తగులబెడుతున్న ప్రజలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

- పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ముందుంది
- సగటున 12 రోజుల్లోనే అనుమతులు
- పరిశ్రమలకు 48 వేల ఎకరాలు సిద్ధం
- హైదరాబాద్‌లో జీఐఎస్ రోడ్ షోలో మంత్రులు రాజేంద్రనాథ్, అమర్‌నాథ్
- ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సుదీర్ఘ తీరప్రాంతం, పుష్కలమైన వనరులు, సుశిక్షితులైన మానవ వనరుల లభ్యత, వ్యాపారాలకు ప్రభుత్వ తోడ్పాటు తదితర సానుకూల అంశాలతో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యామ్నాయం మరేదీ లేదని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సత్వరం అనుమతులు మంజూరు చేస్తూ వ్యాపారాలు, పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ప్రభుత్వం ముందుందని చెప్పారు. విశాఖ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్) 2023కు సంబంధించి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. సుస్థిర అభివృద్ధి సాధిస్తూ ముందుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమలకు అవసరమైన సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని మంత్రి బుగ్గన వివరించారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు నైపుణ్యాల్లో శిక్షణకు కూడా పెద్దపీట వేస్తోందన్నారు. ఐటీ, బల్క్ డ్రగ్ పార్క్, పీసీపీఐఆర్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెరైన్, వ్యవసాయం, పునరుత్పాదకశక్తి వంటి రంగాలలో పెట్టుబడులకు ఏపీ అనుకూలమన్నారు.

అనుమతుల సమయాన్ని కుదించాం

రాష్ట్రంలో పరిశ్రమల కోసం 48వేల ఎకరాలకు పైగా స్థలం సిద్ధంగా ఉందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలకు స్థలం కాకుండా సగటున 12 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. కొత్తగా తేబోయే పాలసీలో 21 రోజుల్లో స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నట్లు వివరించారు. 974 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం, 534 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు, 6 సెజ్‌లు, 3 ఐటీ సెజ్‌లు, 3 పారిశ్రామిక కారిడార్లు, మంచి వృద్ధి రేటుతో పెట్టుబడులకు పూర్తి అనుకూలమని పేర్కొన్నారు. వైజాగ్ ఐటీ గమ్యస్థానంగా మారుతోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో వేలకొద్దీ చిన్న, మధ్యతరహా సంస్థలు ఏర్పాటవుతున్నాయని ఏపీటీపీసీ చైర్మన్ కె.రవిచంద్రారెడ్డి తెలిపారు. బాక్సైట్, మాంగనీస్ తదితర 48 రకాల ఖనిజాల లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ఏపీలో అవకాశాలను తెలియజేసేందుకు, పారిశ్రామిక భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు జీఐఎస్ తోడ్పడుతుందని తెలంగాణ సీఐఐ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి చెప్పారు.

పారిశ్రామికవేత్తల హర్షం

ప్రస్తుతం రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న పారిశ్రామికవర్గాలు ప్రభుత్వ సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎండీ డీవీఎస్ నారాయణ రాజు తెలిపారు. ఏపీలోని తమ ప్లాంటులో నీరు, విద్యుత్ కొరత లేదని చెప్పారు. విద్యుత్, ఇంధనం కూడా మిగతా రాష్ట్రాలతో పోలిస్తే చౌకగా లభిస్తున్నాయన్నారు. స్విచ్‌గేర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డైరెక్టర్ ఒ.జగన్నాథ్ మాట్లాడుతూ తమ సంస్థ ఇప్పటికే చిత్తూరు ఇండస్ట్రియల్ పార్క్‌లో కార్యకలాపాలు సాగిస్తోందని, మరో రూ.150 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సబ్సిడీలు అందిస్తోందని, పరిశ్రమల నిర్వహణ సులభతరం చేసిందని వివరించారు.



ఏపీ గవర్నర్‌గా జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. పదవీ స్వీకార ప్రమాణం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అభినందనలు తెలిపి సత్కరించారు.

విచారణపై సందేహాలు

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు కొనసాగింపుగా శుక్రవారం రెండోసారి సీబీఐ అధికారుల విచారణకు హాజరైనట్లు తెలిపారు. గతంలో విచారణప్పుడు మరోమారు పిలుస్తామని చెప్పారని, ఈసారి మాత్రం మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..

మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

- మీడియా బాధ్యతగా వార్తలు ప్రసారం చేయాలని మనవి చేస్తున్నా. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. మళ్లీ అదే చెబుతున్నా. నేను విజయమ్మ గారి దగ్గరికి వెళ్లి వస్తే.. బెదిరించి వచ్చానని చర్చలు పెట్టి, ప్రచారం చేస్తున్నారు. అది ఎంత వరకు సబబు? నేను దుబాయ్‌కి వెళ్లిపోయానని వక్రీకరించే వార్తలు వేస్తున్నారు.
- తెల్లవారుజామున 3 గంటలకు ఫోన్లు చేశానని వక్రీకరించే వార్తలు వేయడమే కాకుండా దానిపై గంటల తరబడి, రోజులపాటు చర్చలు పెడుతున్నారు. విచారణ జరుగుతున్నప్పుడు మీడియా బాధ్యతగా మెలగాలి. మీడియానే ట్రయల్ పూర్తి చేసి..దోషులెవరో, నిర్దోషులెవరో మీడియానే నిర్ణయిస్తోంది. ఇది విచారణపై ఎంత ప్రభావం పడుతుందో ఒకసారి మీరే ఆలోచించండి. ఒక అబద్ధాన్ని సున్నా నుంచి వందకు పెంచే ప్రయత్నం జరుగుతోంది. అదేవిధంగా ఒక నిజాన్ని వంద నుంచి సున్నా చేసే ప్రయత్నం జరుగుతోంది.
- ముందు నుంచి కూడా ఫ్యాక్ట్ టార్గెట్‌గా కంటే పర్సన్ టార్గెట్‌గా విచారణ జరగడం సరికాదు. గూగుల్ టేకౌట్ అన్నది నిజమైన గూగుల్ టేకౌటా.. టీడీపీ టేకౌటా అన్నది భవిష్యత్తులో కాలమే నిర్ణయిస్తుంది. ఎందుకు ఈ మాట అంటున్నానంటే.. సీబీఐ సమర్పించిన కౌంటర్‌లోని విషయాలన్నీ ఏడాది క్రితం టీడీపీ వాళ్లు చేసిన విమర్శలే. అందువల్ల ఎవరికైనా సందేహాలు రావడం సహజం. ఈ పరిస్థితిలో విచారణ సరైన కోణంలో వెళ్లాలని చెబుతున్నాను తప్ప.. నేను అనుమానించడం లేదు.

ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా

- వివేకం సార్ చనిపోయిన రోజు నేను మార్చురీ దగ్గర మీడియాతో మాట్లాడాను. మళ్లీ రెండు రోజుల తర్వాత కూడా మీడియాతో మాట్లాడాను. ఆ రోజు ఏం మాట్లాడానో.. ఈ రోజు కూడా అదే మాట్లాడుతున్నా. సీబీఐ వాళ్లకు అదే చెబుతున్నా. ఎవరెన్నిసార్లు పిలిచి అడిగినా అదే చెబుతా. ఎందుకంటే నాకు తెలిసిన నిజం అదే కాబట్టి.
- ఆ రోజు ఆ విషయం గురించి మీడియాతో మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి నేనే. అందుకే నేను ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా. సీబీఐ వారి ప్రశ్నలకు నాకు తెలిసిన సమాధానాలు చెప్పాను.
- వివేకం సార్ చనిపోయిన రోజు సీన్ ఆఫ్ క్రైంకి నేను వెళ్లేటప్పటికే అక్కడ ఒక లెటర్ ఉంది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టారు. ఆ లెటర్‌లో అది హత్య అని స్పష్టంగా ఉంది. అందులో అనేక అంశాలు ఉన్నాయి. ఆ విషయాల గురించి నేను చెప్పడం కంటే భవిష్యత్తులో అవన్నీ బయటికి వస్తాయి.
- ఇంతకు ముందు అడిగినట్టే అడ్వొకేట్ సమక్షంలో ప్రశ్నించాలని, అన్ని విషయాలు ఆడియో.. వీడియో రికార్డింగ్ చేయాలని ఇప్పుడు కూడా కోరాం. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ కూడా లెటర్ పెట్టాం. కానీ అది జరగలేదు. అయితే ఒక ల్యాప్‌టాప్‌ను మాత్రం నా ముందు ఉంచారు. అది ఎందుకోసం అన్నది నాకు తెలియదు.

నియోజకవర్గ కమిటీలకు పెద్దపీట

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి సమయం ఇచ్చే 90 మంది కార్యకర్తలను ఎంపిక చేసి వారికి తొలుత వచ్చే నెల 3 నుంచి 6 వరకు నియోజకవర్గాలవారీగా వర్క్‌షాప్స్ నిర్వహించనుంది. అనంతరం అభియాన్ నిర్వహణ తీరుపై శిక్షణ ఇవ్వనుంది. అలాగే పోలింగ్‌బూత్ కమిటీల్లో సభ్యుల సంఖ్యను 21 నుంచి 31కి పెంచాలని బీజేపీ నిర్ణయించింది.

'బండి'ఆధ్వర్యంలోనే ఎన్నికలు...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలోనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తాజాగా స్పష్టతనిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయడంలో భాగంగా సంస్థాగతంగా మార్పులు చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గం, అధికార ప్రతినిధులు, జిల్లా కమిటీలు, ఏడు మోర్చాలు, అనుబంధ విభాగాల్లో అంతగా క్రియాశీలంగా లేనివారు, పార్టీ ఆశించిన మేర పనిచేయని వారు, నిర్దేశిత లక్ష్యాలను సాధించని వారిని పక్కన పెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లా అధ్యక్షుల పనితీరును ప్రాతిపదికగా చేసుకొని దాదాపు 20–25 జిల్లాల అధ్యక్షుల స్థానంలో నియోజకవర్గస్థాయి అధ్యక్షులు లేదా ఇన్‌చార్జీలతో ఎన్నికల కసరత్తుకు దిగాలనే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. వారిలో 20 జిల్లాల అధ్యక్షులు, కమిటీల మూడేళ్ల పదవీకాలం ముగిసినందున ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి.

పర్యవేక్షణ ఫుల్‌టైమర్లదే: బన్సల్

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీకి సంబంధించిన అంశాల పర్యవేక్షణ బాధ్యత పార్టీ ఫుల్‌టైమర్లదేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ స్పష్టంచేశారు. శక్తికేంద్రాల (3, 4 పోలింగ్ బూత్‌లు కలిపి ఒక శక్తికేంద్రం) ఇన్‌చార్జీలతో పాటు పార్టీ మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం రాత్రి దాకా పార్టీ కార్యాలయంలో 17 లోక్‌సభ నియోజకవర్గాలు, 40–50 అసెంబ్లీ నియోజకవర్గాల ఫుల్‌టైమర్లతో బన్సల్, జాతీయ కార్యదర్శి, సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్‌సమీక్షించారు. ఎన్నికలు ముగిసేదాకా ఫుల్‌టైమర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే బస చేసి, పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వార్తలు

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 7నుంచి 8 గంటల వరకు ఖమ్మం 55వ డివిజన్ బ్యాంక్ కాలనీలో వాడ వాడ పువ్వాడ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటిస్తారు. ఆతర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రి, అనంతరం అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం ఎంపీపీఎస్‌లో మన ఊరు–మన బడి పనులను ప్రారంభిస్తారు. అలాగే, నారంవారిగూడెంలో నూతక్కి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించాక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి, ఖమ్మం జిల్లా వైరాలో జరిగే ప్రైవేట్ కార్యక్రమాల్లో మంత్రి పువ్వాడ పాల్గొంటారు.

తామర పురుగు నివారణపై అవగాహన

మధిర: మినుము, పెసర పంటలను తామర పురుగు ఆశిస్తున్నందున సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీ దేవి, ఎంటమాలజీ శాస్త్రవేత్త కె.నాగస్వాతి సూచించారు. పంటల్లోని లేత ఆకులపై తామర పురుగులు వృద్ధి చెంది ఆకుల అడుగుభాగం నుంచి రసం పీలుస్తుండడంతో మొక్కలు గిడసబారి ఎదుగుదల పడిపోతుందని తెలిపారు. అంతేకాక ఈ పురుగుల వల్ల ఆకు ముడత వైరస్ వ్యాపిస్తుందని పేర్కొన్నారు. ఈమేరకు తామర పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ ఎఫ్ఎస్ 5 మిల్లీలీటర్లతో కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలని సూచించారు. పురుగుల ఉధృతిని గుర్తించేందుకు నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే, మోనోక్రోటోపాస్ 1.6 ఎం.ఎల్, ఎసిఫేట్ 1.5 ఎం.ఎల్, ఫిప్రోనిల్ 2.0 ఎం.ఎల్ లేదా సైనోసాడి 0.3 ఎం.ఎల్, ఎసిఫేట్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఇక పంట పొలాల్లో వయ్యారిభామ కలుపు లేకుండా చూడాలని తెలిపారు.

డీఏఓ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఆదివారం జరగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎస్తేర్ ప్రభులత తెలిపారు. కేంద్రాలకు గంట ముందుగానే చేరుకునేలా సాధారణ చార్జీలతో రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి బస్సులు నడిపిస్తామన్నారు. అన్ని బస్టాండ్లలో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

అటవీ సంపద రక్షణే ధ్యేయం

- భద్రాచలంలో నాలుగు రాష్ట్రాల అధికారుల భేటీ
- కార్యాచరణపై సమీక్ష



భద్రాచలంలో సమావేశమైన నాలుగు రాష్ట్రాల అటవీ అధికారులు

భద్రాచలం అర్బన్: రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న అటవీ సంపద రక్షణే ధ్యేయంగా చర్యలు చేపట్టాలని నాలుగు రాష్ట్రాల అటవీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అటవీ కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ అధికారులు శుక్రవారం భేటీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్‌ఓ రంజిత్‌నాయక్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా డీఎఫ్‌ఓ తేజస్ శేఖర్, బీజాపూర్ నుంచి అశోక్ పాటిల్, ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి కె.ప్రతాప్, ఏపీలోని చింతూరు నుండి వి.సాయిబాబా, భద్రాచలం నుంచి బి.బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాల సరిహద్దుల్లో అక్రమ కలప రవాణాను అరికట్టేందుకు సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. అంతేకాకుండా అంతర్‌రాష్ట్రాల అటవీ సరిహద్దులపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ పోడు, గొత్తికోయల చొరబాటు, అటవీ భూముల ఆక్రమణ, అటవీ ఫలసాయం రవాణా, సరిహద్దు అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇక ఉత్పత్తుల సేకరణలో నాణ్యత పాటించేలా పర్యవేక్షిస్తూ రాష్ట్రాల్లోని అటవీ సిబ్బంది మధ్య సమన్వయానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. అంతేకాకుండా రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాల నిర్మాణం, నోడల్ అధికారుల నియామకం, పులి, ఇతర అటవీ జంతువుల కదలికలు, పరిరక్షణకు సంయుక్తంగా చర్యలు చేపట్టాలనే తదితర అంశాలపై చర్చించారు.

నేల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వరంగల్ ఆర్ఈఆర్ఎస్ ఏడీఆర్ ఉమారెడ్డి



నేల ప్రాముఖ్యత బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఉమారెడ్డి, అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు నేల ఆరోగ్యంపై దృష్టి సారించాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు ఆర్.ఉమారెడ్డి సూచించారు. మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రైతు కూడా నేల ఆరోగ్యంపై దృష్టి పెడుతూ, పచ్చిరొట్ట పంటలు వేయడం ద్వారా ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. అలాగే, పంటల అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని, తద్వారా భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. అనంతరం రైతుల అవగాహన కోసం రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈసమావేశంలో మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, అగ్రి పాలిటెక్నిక్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, అధికారులు బి.ఛత్రునాయక్, సూర్యనారాయణ, కె.సమ్మయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



ఎస్సారెస్పీ జలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పాటుపడుతోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తెలిపారు. కేసముద్రం మండలం వెంకటగిరి శివారులోని వట్టివాగులోకి ఎస్సారెస్పీ జలాలు విడుదలైన సందర్భంగా ఎమ్మెల్యే శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టివాగులో నీరు లేకపోవడంతో ఇరువైపులా 30వేల ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని రైతుల చేసిన విజ్ఞప్తితో ఉన్నతాధికారులతో మాట్లాడి ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయించామని తెలిపారు. ఈసందర్భంగా ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయించిన ఎమ్మెల్యేకు రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ మాదారపు సత్యనారాయణరావుతో పాటు నాయకులు ఎండీ.నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, గణపారపు రమేష్, పెదగొని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ



దాతకు రశీదు అందచేస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం ఏపీకి చెందిన భక్తులు నగదు విరాళంగా అందచేశారు. విశాఖపట్నంకు చెందిన ఏఎస్‌వీఎస్ఎల్.అరవింద రూ.1,08,000 నగదును ఆలయ అధికారులకు అందచేయగా వారు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్మీ 'వజ్ర' వాహనం

వైరాలో మరమ్మతులు, ఆపై హైదరాబాద్‌కు...



మరమ్మతుల అనంతరం హైదరాబాద్ వెళ్తున్న వజ్ర వాహనం

వైరా: ఆర్మీ జవాన్లతో వెళ్తున్న సీఐఎస్ఎఫ్‌కు చెందిన మైన్స్ ప్రూఫ్ వజ్ర వాహనం ఖమ్మం జిల్లా వైరాలో మొరాయించింది. ఛత్తీస్‌గఢ్‌లోని జబల్పూర్ నుంచి జవాన్లతో వజ్ర వాహనం శుక్రవారం హైదరాబాద్‌కు బయలుదేరింది. కొత్తగూడెం జిల్లా సరిహద్దు వరకు అక్కడి పోలీసులు, ఖమ్మం జిల్లాలో జిల్లా పోలీసులు బందోబస్తుగా వస్తున్నారు. ఈక్రమంలో వైరా పాత బస్టాండ్ సమీపానికి రాగానే డీజిల్ లీకేజీ సమస్యతో వాహనం మొరాయించడంతో జాతీయ రహదారి పక్కన నిలిపేశారు. అందులో నుంచి బలగాలు తుపాకులతో కిందకు దిగడంతో స్థానికులు ఆందోళనకు గురికాగా, వాహనానికి సమస్య ఎదురైందని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు అనంతరం మరమ్మతు చేయించాక ఆర్మీ బలగాలు హైదరాబాద్ బయలుదేరాయి.

సైనిక్ స్కూల్, కళాశాలలో ప్రవేశానికి రేపు పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ రూరల్: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్, కళాశాలలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష జరగనుంది. ఈ విషయాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఖమ్మంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, టేకులపల్లిలోని జూనియర్ కళాశాల, పాల్వంచలోని తెలంగాణ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలికలు)తో పాటు మహబూబాబాద్‌లోని గురుకుల జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష సమయానికి అర గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

సింగరేణిలో వైద్యుల నియామకం



అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 26 మంది వైద్యుల నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఏర్పాటుచేయగా డైరెక్టర్(పా) ఎస్.బలరామ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈమేరకు 43మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా హాజరైన 17మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు గాను ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్యతో పాటు అధికారులు బీ.వీ.రావు, శ్రీనివాస్, వేణుగోపాల్, డాక్టర్ సునీల, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యుడిగా మాజీ మంత్రి సంభాని



సంభాని చంద్రశేఖర్

కల్లూరు/కూసుమంచి: ఏఐసీసీ సభ్యుడిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కు స్థానం దక్కింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం మొదలైన ఏఐసీసీ ప్లీనరీలో ఈమేరకు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సంభాని నియామకాన్ని ప్రకటించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సహకరించిన సోనియాగాంధీ, రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సంభాని నియామకంపై కాంగ్రెస్ కల్లూరు మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు మాదిరాజు లక్ష్మణ్‌రావు, కొండూరి కిరణ్‌కుమార్, గుండ్ల పుల్లారావు, కీసర శ్రీనివాసరెడ్డి, పోతురాజు నరేంద్ర, జక్కేళ్ల కృష్ణారెడ్డి, జొన్నలగడ్డ గోపాలస్వామి, ఎండీ.హఫీజుద్దీన్, పీర్యానాయక్, బెల్లంకొండ శరత్, కిరణ్, బండారుపల్లి శ్రీనివాస్, వనం మధుసూదన్, బాబునాయక్, భూపాల్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.